# శకలాలు

- డా. గుర్రాల రవికృష్ణ

ఆ రోజంతా వెంకట్రామయ్య మనసు చాలా అశాంతిగా వుంది. ముఖంలో ఆందోళన కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. కళ్లల్లో ఏదో చెప్పుకోలేని దిగులు స్పష్టంగా తెలుస్తోంది.

రాత్రి పదిగంటలయింది.

ఆకాశంలో చంద్రుడు పాల సముద్రంలో వెలిసిన అమృతభాండంలా మెరిసిపోతున్నాడు. తెల్లటి పాలు వలకబోసినట్లుగా వెన్నెల పరుచుకుంటోంది. ఆ వెన్నెల వెలుగులో లోకమంతా వెండిపూత పూసుకున్నట్లుగా వుంది. వేసవికాలం అయినా ఎండవేడి తగ్గిపోయి చల్లటి గాలి వీస్తోంది.

ఇంటి చుట్టూ వున్న కాంపౌండ్‌లోని వేపచెట్లు, కొబ్బరిచెట్ల మీదుగా వచ్చే గాలి డాబా పిట్టగోడ మీదుగా పాకించిన సన్నజాజుల పరిమళాలను మోసుకొస్తూ ఎంతో ఆహ్లాదకరంగా వుంది. మామూలుగా అయితే వెంకట్రామయ్య కూడా ప్రకృతిలో వెల్లివిరుస్తున్న ఈ ఆనందాన్ని డాబాపైన పడుకుని ఆస్వాదించేవాడే. కానీ ఈరోజు మాత్రం ఆయనకు వేపచెట్టు గాలి, కొబ్బరి ఆకుల కదలికలు ఏమాత్రం ఆనందాన్ని కలిగించడంలేదు. పైపెచ్చు వేడిగాలులు వీస్తున్న భావన కలుగుతోంది.

అరవై సంవత్సరాల వెంకట్రామయ్యకు ఆ పెద్ద ఇంటిలో తోడు ఆయన కొడుకు మాధవ, కోడలు విజయ, ఎనిమిదేళ్ల మనవరాలు మనీత. భార్య రెండేళ్ల క్రితం పోయింది. కొడుకు తండ్రికి కావాల్సిన సౌకర్యాలన్నీ జాగ్రత్తగా అమర్చి పెడ్తూ వుంటాడు. కోడలికి మామగారంటే చెప్పలేనంత అభిమానం. మనవరాలికి తాతయ్యతో ఆడుకోడమంటే తగని సరదా.

వెంకట్రామయ్యకు ఇరవై మైళ్ల దూరంలో వున్న సొంత పల్లెలో చాలా పొలాలున్నాయి. కొడుకు కొంత పొలం అమ్మేసి ఇక్కడ పట్నంలో ఒక పరిశ్రమ పెట్టాడు.

వెంకట్రామయ్యకు ఆర్థికపరంగాగానీ, కుటుంబ పరంగాగానీ ఏ చీకూచింతా లేదు. అయినా ఎందుకో ఈరోజు చాలా అన్యమనస్కంగా వున్నాడు.

నెమ్మదిగా లేచి రోడ్డువైపున్న పిట్టగోడ దగ్గరకెళ్లి నిలబడ్డాడు.

ఫర్లాంగ్ దూరంలో గుట్టమీద వేణుగోపాలస్వామి గుడి వెన్నెల వెలుగులో అందంగా కన్పిస్తోంది. ఊరంతా నెమ్మదిగా నిద్రలోకి జారుకుంటోంది.

అరఫర్లాంగ్ దూరంలో ఎత్తుగా వున్న పాతకాలం చర్చి. బ్రిటిష్ వాళ్ల కాలంలో కట్టింది కాబోలు చెక్కు చెదరకుండా ఆ ఊరిలో వస్తున్న అనంతమైన మార్పులకు ప్రత్యక్ష సాక్షిగా ధీమాగా, గంభీరంగా మౌనంగా వుంది. చర్చి గోడకు పై భాగంలో గంటలు కొట్టే గడియారం అవిశ్రాంతంగా దశాబ్దాల తరబడి క్షణక్షణానికి తరిగిపోయే కాలాన్ని గుర్తు చేస్తూ తిరుగుతూ వుంది.

ఆ వీధి చివర్లో ఒక పెద్ద రావిచెట్టు. దాని చుట్టూ పెద్ద అరుగు. గతంలో వూరి పంచాయితీలన్నీ అక్కడే జరిగేవి. క్రమేణా వూరు పెద్దది కావడంతో ఆ రచ్చబండ ప్రాముఖ్యత తగ్గిపోయింది. రాత్రయితే చాలు దానిమీద సాధువులు కొందరు చేరి చిలుం నుండి గంజాయి పీలుస్తూ ఏకతర మీటుతూ బ్రహ్మంగారి తత్వాలు పాడుకుంటూ అదోలోకంలో వుంటారు. అప్పుడే ఎవరో సాధువు 'చెప్పలేదంటనక పోయ్యేరు' అని బ్రహ్మంగారి తత్వం పాడుతున్నాడు.

వెంకట్రామయ్య వూరివైపు చూస్తుంటే ఎన్నెన్నో మార్పులొచ్చాయనిపించింది. తను ఈ ఊరిలో చేరేప్పటికి జనాభా అయిదువేలు. ఇప్పుడో ముప్పై అయిదు వేలు దాటింది. ముప్పై ఏళ్లక్రితం ఈ ఊర్లో ఒక టెంటు హాలు వుండేది. ఇప్పుడు మూడు సినిమా హాళ్లు ఉన్నాయి. అప్పట్లో కాలక్షేపానికి గుడి దగ్గర హరికథలకు, పురాణ కథలకు ఎంతోమంది వచ్చేవారు. ఇప్పుడు ఆ హరికథల జాడేలేదు. పురాణ కాలక్షేపాలసలే లేవు. ఇప్పుడు ఇంటిమీద చూసినా, పొలం మధ్యలో చేతులు చాపి నిలబెట్టిన దిష్టిబొమ్మల్లా టీవీ ఆంటీన్నాలే. ఇంటి నుండి ఇంటికి అడ్డదిడ్డంగా వేసిన కేబుల్ టీవీ వైర్లే.

సంవత్సరాలు గడిచేకొద్దీ, తరాలు మారేకొద్దీ ప్రజల్లో కొత్త ఆలోచనలు, కొత్త కొత్త భావాలు, మనిషి నమ్మే విలువల్లో, ఆప్యాయతల్లో, అభిమానాలలో అన్నిటా మార్పులు వచ్చేస్తున్నాయి. నిజమే మార్పన్నది పాతతరం అంత సులువుగా అంగీకరించలేని సహజ పరిణామం.

వెన్నెల్లో వూరును చూస్తున్న వెంకట్రామయ్యకు తను పల్లె వదిలి ఈ ఊరు వచ్చి స్థిరపడ్డానికి ముందు జరిగిన సంఘర్షణ గుర్తొచ్చింది.

వెంకట్రామయ్య నాన్న ఇక్కడికి దగ్గరలో వున్న ఒక చిన్న పల్లెలో పెద్ద భూస్వామి. ఆ పల్లె అంటే ఆయనకు ఎనలేని అభిమానం, ఆపేక్ష. వెంకట్రామయ్యకు పెళ్లయ్యాక పల్లె వదిలి పట్నానికి వచ్చి స్థిరపడాలని ఆశపడి తండ్రితో చెప్పాడు. ఆయన ససేమిరా వినలేదు. తండ్రిపైవున్న గౌరవానికి ఎదురు చెప్పలేని అసక్తత తోడయి వెంకట్రామయ్య పట్నానికి వెళ్లి స్థిరపడాలన్న ఆలోచనలు వాయిదా వేసుకున్నాడు.

తండ్రి చనిపోయాక ఇక పెద్దగా ఆలోచించలేదు వెంకట్రామయ్య. సంవత్సరానికల్లా ఇప్పుడు వుంటున్న ఈ ఇల్లు కట్టించి ఇక్కడికే వచ్చి స్థిరపడ్డాడు.

వెంకట్రామయ్య గతం ఆలోచనల్లో నుండి బయటపడి నెమ్మదిగా వచ్చి డాబాపై వున్న వూయల బల్ల మీద పడుకున్నాడు. వూయల గాలికి నెమ్మదిగా వూగుతుంటే ఆయన ఆలోచనలు సరిగ్గా నెలక్రితం ఇదే చోట జరిగిన ఒక సంఘటన మీదకు వెళ్లాయి. ఈ రోజు ఆయన ఆందోళనకు కారణం ఆ సంఘటనే.

★★★

సన్నజాజులు లోకమంతా వెదజల్లినట్లుగా వెన్నెల విరగకాస్తోంది. డాబాపైన వూయల బల్లమీద పడుకుని వెన్నెలను, చల్లటి గాలిని ఆస్వాదిస్తున్న వెంకట్రామయ్య కొడుకు మాధవ వచ్చి "నాన్నా" అని పిలిచేవరకు గమనించలేదు.

మాధవ ఆ సమయంలో అక్కడికి రావడంతో ఒకింత ఆశ్చర్యపోయాడు వెంకట్రామయ్య.

ఏమిట్రా అన్నట్లు చూసాడు మాధవవైపు.

"ఈ రోడ్డు బాగా రద్దీగా అయిపోయింది నాన్నా. ఎప్పుడు శబ్దాలు, రణగొణధ్వని ఎక్కువైపోయాయి. ప్రశాంతత తగ్గిపోయింది" అన్నాడు మాధవ లాల్చీ బొత్తాలు సరి చేసుకుంటూ తాను చెప్పబోయే దానికదే ఉపోద్ఘాతంలా.

"అవున్రా మాధవా. ఇటువైపుగా బస్టాండ్ వచ్చాక ఈ రోడ్డు బాగా రద్దీగా అయిపోయింది" అన్నాడు వెంకట్రామయ్య లేచి కాళ్లు కిందకు పెట్టి వూయల బల్లమీద కూర్చుంటూ.

"అందుకే నాన్నా ఈ రోడ్డు మంచి బిజినెస్ సెంటర్ అయింది. ఈ కారణంగానే శ్రీనివాసనగర్ కాలనీలో పదిసెంట్ల స్థలం కొన్నాను. అక్కడో ఇల్లు కట్టిద్దామనుకుంటున్నాను. మీరేమంటారు?" అడిగాడు మాధవ కళ్లజోడు తీసి లాల్చీ అంచుతో తుడుచుకుంటూ.

"అలాగే కట్టించు మాధవ. అద్దెకివ్వొచ్చు. వూళ్లో అద్దెలు కూడా బాగా పెరిగాయి" అన్నాడు వెంకట్రామయ్య వక్కపొడి కాస్త నోట్లో వేసుకుంటూ.


"అదికాదు నాన్నా. అద్దెకివ్వడానికి కాదు. మనం

ఉండడానికే కట్టించాలనుకున్నాను'' అన్నాడు మాధవ కాస్త నెమ్మదిగా. చల్లకొచ్చి ముంత దాచే ప్రయత్నమేమీ చేయలేదు.

ఒక్క నిముషం ఏం చెప్పాలో తోచలేదు వెంకట్రామయ్యకు.

''సరే మాధవా. నీ ఇష్టం ఎలా వుంటే అలా చెయ్యి. నీవేది చేసినా నేనెప్పుడైనా కాదన్నానా'' కొద్దిగా భారంగా చెప్పాడు వెంకట్రామయ్య.

''అంతేకాదు నాన్నా. ఈ ఇల్లు పడగొట్టించి పెద్ద షాపింగ్ కాంప్లెక్స్, దానిపైన ఒక హోటల్



కట్టించాలని ప్లాన్ తయారు చేయించాను.'' చెప్పాడు చావు కబురు చల్లగా చెప్పినట్లు.

ఆ మాట చెప్పేసి పిట్టగోడ దగ్గరకు వెళ్లి రోడ్డు వైపు చూస్తూ నిలబడ్డాడు మాధవ. తండ్రివైపు చూస్తే తన నిర్ణయం ఎక్కడ మారుతుందేమోనన్న చిన్న భయంతో.

ఉరుములు, మెరుపులు లేకుండానే పెద్ద పిడుగు హఠాత్తుగా పడినట్లనిపించింది. భూమి బద్దలై తనను లాక్కుని పోతున్నట్లు అనిపించింది.

వెంకట్రామయ్య నిశ్చేష్టుడైపోయాడు. నోట్లోంచి మాట పెగల్లేదు. ఈ ఇల్లు పడగొట్టించేస్తాడని ఊహించలేదు.

కొడుకు మంచివాడు. యోగ్యుడు. కానీ కొడుకు వ్యాపార దృక్పథానికి, ఆ ఇంటితో ఆయనకున్న అనుబంధం ఏమాత్రం కన్పించదని ఆయనకు తెలుసు. మాధవ ఏదన్నా నిర్ణయం తీసుకుంటే ఓ పట్టాన మార్చుకోడని ఆయనకు బాగా తెలుసు. అందుకే చివరకు కాస్త తేరుకుని ''సరే నీ ఇష్టం మాధవా. కానీ ఇది నేను స్వంతంగా దగ్గరుండి కట్టించుకున్న ఇల్లురా. మళ్లీ ఒకసారి ఆలోచించి నిర్ణయం తీసుకో'' గొంతు పూడుకుపోతుంటే ఆవేదనతో శరీరం వణుకుతుంటే ఎలాగో అతి కష్టం మీద ఆ మాట అనేసి అక్కడనుండి వెళ్లిపోయాడు వెంకట్రామయ్య.

★★★

చర్చి గడియారం పన్నెండు గంటలు కొట్టింది. ఆ శబ్దానికి ఆలోచనా స్రవంతి నుండి బయటపడ్డాడు వెంకట్రామయ్య. తల పైకెత్తి చూసాడు. బోసి నవ్వుల పసిపాపలా వెన్నెల నవ్వులు చిందిస్తూనే ఉన్నాడు చందమామ.

నెలక్రితం మాధవతో ఆ సంభాషణ జరిగాక తర్వాత మళ్లీ ఈ రోజు ఉదయం తిరిగి ఆ ప్రస్తావన తెచ్చాడు మాధవ. వెంకట్రామయ్య తోటలు తిరుగుతుంటే మాధవ వచ్చి చెప్పాడు 'రేపు ఉదయం నుండి

ఈ ఇల్లు కూలగొట్టడం మొదలవుతుందని, కొత్తగా కట్టే ఇంటకి దగ్గరలో అద్దెకు ఇల్లు తీసుకున్నానని, రేపే అక్కడికి వెళ్లిపోవాలని'.

సామాన్లన్నీ ఆ రోజే అద్దె ఇంటికి మార్చేసారు. ఈ ఇంట్లో ఆఖరి నిద్ర కోసమని ఈ రోజు ఇక్కడే ఆగిపోయారు. మాధవ చెప్పిన మాటలు విన్నప్పటి నుంచి వెంకట్రామయ్య మనసు మనసులో లేదు. ఈనాటిదా తన అనుబంధం ఈ ఇంటితో. ముప్పై ఏళ్లుగా తన జీవితంతో విడదీయలేనంతగా పెనవేసుకుపోయింది. తన జీవితంలో జరిగిన స్మృతులను అనుక్షణం గుర్తు చేస్తూ ఉండే ఇల్లు ఇది.

ఈ ఇంటిలో వున్న ప్రతి రాయికి, అణువణువుకూ తెలుసు తన జీవితం ఆ ఇంటితో ఎలా మమేకమయిపోయిందో. తెలియనిదల్లా కొడుకు మెటీరిలిస్ట్ మనసుకే.

రేపు ఈ ఇల్లు వుండదు. శకలాలుగా మిగిలిపోతుందని తల్చుకోగానే దుఃఖం కనురెప్పల చాటు నుండి పొంగుకొస్తోంది. వూయల బల్లమీద నుండి లేచి తోట వైపున్న పిట్టగోడ దగ్గరకు వచ్చాడు.

గోడ దగ్గర నిలబడి వేపచెట్టు వంక చూసాడు వెంకట్రామయ్య. హఠాత్తుగా ఆయనకు ఆ వేపచెట్టుపైన ఒక పక్షుల గూడు వున్న విషయం గుర్తొచ్చింది. దాంట్లో చిన్న చిన్న పక్షి పిల్లలున్నాయి.

రేపు ఈ ఇంటితోపాటు ఆ చెట్టును కూడా కూల్చేస్తారు కాబోలు. ఆ విషయం తల్చుకోగానే హృదయం బరువెక్కినట్లనిపించింది.

పెద్ద పక్షి ఎంత కష్టపడి పుల్లలు, గడ్డిపరకలు, ఎండలో, వానలలో ఒక్కటొక్కటే తెచ్చి కట్టుకుందా గూడు. తన పసికూనలకు సురక్షితమైన స్థలంగా భావించి వుంటుందా పిచ్చితల్లి. ఒకరోజు ఆ గూడు చెదిరిపోతుందని ఊహించి వుండదు. వెంకట్రామయ్య కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి.

అర్ధరాత్రి దాటింది. రావిచెట్టు అరుగుపైన సాధువులు తత్వాలు పాడ్డం ఆపుచేసి నిద్రలో జోగుతున్నారు. ఎవరో ఓ సాధువు మాత్రం పాట పాడకుండా ఏకతార మీటుతున్నాడు. చర్చి గడియారం ఆగకుండా తిరుగుతూనే వుంది ఎప్పుడెప్పుడు గంటలు కొడదామా అని ఎదురు చూస్తూ.

వెంకట్రామయ్యకు ఓసారి ఇల్లంతా కలియతిరగాలనిపించింది. మెట్లవైపుగా అడుగులు వేసాడు.

మెట్లు దిగుతుంటే పదవ మెట్టు దగ్గరకు వచ్చేసరికి ఒకసారి ఆగిపోయాడు. నెమ్మదిగా ఆ మెట్టుమీద కూచున్నాడు. ఆ మెట్టుకు మధ్యలో పెచ్చులూడిపోయాయి. చిన్నప్పుడు మాధవ ఓసారి ఆ మెట్టుకు తగిలి క్రింద పడి ఏడుస్తుంటే తను ఓదార్చి ఓ సుత్తి తీసుకుని 'నా బాబుకు దెబ్బ తగిలిస్తావా?' అంటూ ఆ మెట్టుమీద కొడితేగానీ మాధవ ఏడుపు ఆపలేదు. అప్పుడే ఆ పెచ్చులూడిపోయాయి. ఇంట్లో ఎన్నోసార్లు మరమ్మత్తులు చేయించినా ఆ మెట్టు మాత్రం అలాగే వదిలేసాడు కావాలని మాధవ చిన్నప్పటి గుర్తుగా. చేత్తో నెమ్మదిగా పెచ్చులూడిన చోట తడిమాడు వెంకట్రామయ్య. ముద్దొచ్చే చిన్నప్పటి మాధవ బుగ్గలు నిమిరినట్లుగా అన్పించింది.

తన పడక గదిలో అడుగుపెట్టాడు. కిందకు దిగివచ్చి ఒక్కసారిగా తీయటి మధురస్మృతుల తెమ్మెరలు మనసుకు తగిలి గిలిగింతలు కలిగించింది. గదిలోని అలమారకు బిగించిన అద్దం దగ్గరకు వెళ్లి చూసుకున్నాడు. అప్రయత్నంగా చేయి తలపైకి వెళ్లింది. నల్లగా వత్తుగా వుండేది జుత్తు. ఇప్పుడు సగం జుట్టు ఊడిపోయింది. మిగిలిన సగం తెల్లరంగు పులుముకుంటోంది. ముఖంమీద ముడతలు బాగా కన్పిస్తున్నాయి. వెళ్లి గది మధ్యలోవున్న పందిరి మంచం పై కాసేపు కూర్చున్నాడు. ఆ గదిలో జరిగిన అనేక సరదా చిలిపి విషయాలు గుర్తొచ్చి చిరుదరహాసం ఆయన ముఖంపై వెల్లివిరిసింది.

పడకగది నుండి బయటకు వచ్చి దేవుడి గదిలోకి వెళ్లగానే తను, భార్య కలసి చేసిన ఎన్నో వ్రతాలు, నోములు జ్ఞాపకానికి వచ్చాయి. వెళ్లి పూజామందిరం దగ్గర కూర్చున్నాడు. మనసు ప్రశాంతంగా అవడానికి కాసేపు ధ్యానం చేసాడు.

పూజామందిరం వెలుపలికి వచ్చి వరండాలోకి వెళ్తూ హాలుకు వరండాలకు మధ్యలో వున్న ద్వారం వద్ద కాసేపు ఆగిపోయాడు. ఈ ద్వారం తను ఎంతో ఇష్టపడి మంచి నగిషీలు చెక్కించి తయారు చేయించాడు. వెళ్లి చేతులతో ద్వారబంధాన్ని తడిమాడు.

వరండాలో అడుగుపెట్టిన వెంకట్రామయ్య శరీరం అనుభూతుల తీవ్రతకు స్వల్పంగా కంపించింది. ఇక్కడేకదా తన భార్య తన వడిలో తలపెట్టి కన్నుమూసింది. ఛాతీలో నొప్పికి తీవ్రంగా బాధపడ్తున్న ఆమె తలను తన వడిలోకి తీసుకోగానే ఆఖరి శ్వాస వదిలింది. ఇంకా ఆ దృశ్యం కళ్లముందే కదలాడుతోంది.

అప్పుడే రెండేళ్లు గడిచిపోయాయి. ఆయన కళ్లు చెమ్మగిల్లాయి.

కాంపౌండ్‌లోకి వచ్చి తోటలో కాసేపు తిరిగి అక్కడున్న పూలచెట్లను, పండ్ల చెట్టును ఆప్యాయంగా పలకరించి తనకిష్టమైన వేపచెట్టు కింద సిమెంట్ బెంచ్‌పైన కూర్చున్నాడు వెంకట్రామయ్య.

తలెత్తి పైకి చూసాడు. వెన్నెల వెలుగులో పక్షుల గూడు స్పష్టంగా కన్పిస్తోంది. నిద్రపోతున్నాయేమో పక్షి పిల్లలు తల్లి రెక్కల చాటు వెచ్చదనంలో. రేపు ఉదయం మాధవతో చెప్పి ఆ గూడు జాగ్రత్తగా దింపించి పక్కన మూలలో పెట్టించాలి. తల్లి పక్షి తిరిగొచ్చాక వాటి సంగతి చూసుకుంటుందనుకున్నాడు వెంకట్రామయ్య.

వెంకట్రామయ్య అలా ఆలోచిస్తూ అక్కడే ఎప్పుడో నిద్రలోకి జారుకున్నాడు.

నిద్రలో ఏవేవో కలలు. అన్నీ ఆ ఇంటి గురించే. కూలిపోయిన ఇంటి శకలాల మధ్య తను కూరుకుపోతున్నట్లు, పడిపోతున్న ద్వారబంధాన్ని పట్టుకుని ఆపుతున్నట్లు ఎక్కడ నుండో పక్షుల ఏడుపులు.

తెలతెలవారుతుండగా ఆ రోజు లోకంపై తను చూపించబోయే ప్రతాపానికి సూచికలుగా వేసవి సూర్యుడు తన వాడి వేడి కిరణాలతో వెంకట్రామయ్యకు మెలకువ తెప్పించాడు. కళ్లు తెరిచి పగటి వెలుగులో ఇంటివైపు చూసాడు. కూలబోతున్న విషయం తెలియని ఆ ఇల్లు అమాయకంగా, అందంగా, ఆనందంగా వూరివైపు చూస్తోంది.


వెంకట్రామయ్య లేచి స్నానాదులు ముగించి రోజులాగే వేణుగోపాలస్వామి గుడికి బయలుదేరాడు.

గుడికి వెళ్లేముందు పక్షిగూడు గురించి కొడుక్కి చెప్పాలని చూస్తే అప్పటికే మాధవ బయటకు వెళ్లిపోయాడు. కోడలు, మనవరాలు ఇంకా నిద్రపోతున్నారు. లేపటం ఎందుకులెమ్మని గుడి నుంచి వచ్చాక మాధవతో చెప్పొచ్చులే అనుకుని ఆయన వెళ్లిపోయాడు.

ఆ రోజు మామూలుగాకన్నా ఓ గంట ఎక్కువసేపు గుడిలో గడిపాడు. ఆందోళనగా, అన్యమనస్కంగా వున్న మనసుకు వేణుగోపాలుడి చెంతలో కాస్తంత స్వాంతన చేకూరినట్లనిపించింది.

గుళ్లో అర్చన చేయించి గుడిమెట్లు దిగుతూంటే ''వెంకట్రామా' అన్న ఆప్యాయత నిండిన పిలుపు వినిపిస్తే పక్కకు తిరిగి చూసాడు. గుడి ఆవరణలోనే వున్న కళ్యాణవేదిక మెట్లపైన కూర్చుని కనిపించాడు తన చిన్ననాటి నేస్తం రాఘవ.

రాఘవ, వెంకట్రామయ్య ఒకే ఊరివారు. ఒకే స్కూల్లో చదువుకున్నారు.



వెంకట్రామయ్య ఈ ఊరు వచ్చాక రాఘవ కూడా ఇదే ఊర్లో స్కూలు టీచరు ఉద్యోగంలో చేరాడు. తరచూ ఇదే గుడిలో కలసి కష్టసుఖాలు మాట్లాడుకుంటూ వుంటారు.

దిగులు నిండిన వెంకట్రామయ్య మనసుకు రాఘవను చూడగానే ప్రాణం లేచొచ్చినట్లనిపించింది. గబగబా వెళ్ళి రాఘవ పక్కన కూర్చున్నాడు.

దగ్గరలోవున్న జమ్మిచెట్టుపై నుండి చల్లటి గాలి వీస్తోంది. గుళ్లో గంటలు గణగణా మోగుతున్నాయి. పూజారి మంత్రాలు బయటకు మంద్ర స్థాయిలో వినిపిస్తున్నాయి.

''ఏం వెంకట్రామా! ఎందుకో దిగులుగా వున్నావే? వారం నుండి అసలు కన్పించడంలేదు'' అడిగాడు రాఘవ కొబ్బరిచిప్పను పగులగొడుతూ.

ఎందుకో స్నేహితుడికి తన బాధంతా చెప్పుకోవాలనిపించింది వెంకట్రామయ్యకు. విషయమంతా చెప్పుకొచ్చాడు.

అంతా విని దీర్ఘంగా నిట్టూర్పు వదుల్తూ ''పొరపాటు చేసావు వెంకట్రామా. మాధవకు నీ మనసులో విషయం చెప్పేసి ఇల్లు పడగొట్టించొద్దని చెప్పాల్సింది. నీవు చెప్తే కాదూ కూడదని తన పని తాను చేసుకు వెళ్లేంత చెడ్డవాడు, మూర్ఖుడు కాదు మాధవ'' అన్నాడు రాఘవ.

''నిజమే రాఘవా. నేను గట్టిగా చెప్తే ఆగిపోయేవాడే. నేను శిశిరంలో ప్రవేశించినవాడ్ని. వాడు వసంతంలో అడుగుపెడుతున్నాడు. నేను రేపో మాపో రాలిపోయే పండుటాకును. వాడి ఆలోచనలకు, పథకాలకు, భవిష్యత్తుకు నేనెందుకు అడ్డుపడాలనే ఉద్దేశ్యంతో ఆగిపోయాను'' నిదానంగా చెప్పాడు వెంకట్రామయ్య కొబ్బరి ముక్క కళ్లకు అద్దుకుని నోట్లో వేసుకుంటూ.

''లేదు వెంకట్రామా. ఇప్పటికే ఆలస్యం అయింది. ఇక కాలయాపన చేయవద్దు. నేనూ వస్తాను. పద ఇద్దరం వెళ్లి మాధవతో చెప్పి ఇంటిని కూలగొట్టించే ఆలోచనలకు స్వస్తి పలికిద్దాం. నీవలా బాధపడుతూ నీలో నీవే కుమిలిపోతే లాభంలేదు'' అంటూ పైకి లేచాడు రాఘవ.

తన మనసులో కూడా అలా చేస్తే బావుంటుందన్న ఆలోచన వస్తున్న సమయంలో ప్రాణస్నేహితుని మాటలు మరింత వూతం అందివ్వడంతో సరేనంటూ తనూ లేచి రాఘవ తోపాటు ఇంటివైపు దారి తీసాడు వెంకట్రామయ్య.

ఒకసారి ఆ నిర్ణయం తీసుకున్నాక ఆయనలో ఆందోళన మాయమైంది. మనిషిలో ఉత్సాహం తొణికిసలాడింది. కళ్లల్లో మళ్లీ కళ తొంగి చూస్తోంది.

ఇద్దరు మాట్లాడుకుంటూ వెంకట్రామయ్య ఇంటివీధి మలుపు దగ్గరకు వచ్చారు.

చర్చి గడియారం పదకొండు గంటలు చూపిస్తోంది. మార్పులెన్ని వచ్చినా కాలం మాత్రం ఆగదు. నిరంతరం ముందుకు కదులుతూనే వుంటుంది.

రావిచెట్టు అరుగు దగ్గరకు వచ్చి తలెత్తి ఇంటివైపు చూసిన వెంకట్రామయ్య, రాఘవ నిశ్చేష్టులైపోయారు. వెంకట్రామయ్యకు గుండెను చేత్తో పట్టుకుని పిండినట్లనిపించింది. అప్పటికే అక్కడ ఓ యాభైమంది పనివారు, బుల్‌డోజర్ సహాయంతో ఇల్లు కూలగొట్టేస్తున్నారు.

శరీరం కొద్దిగా తూలినట్లన్పించడంతో వూతం కోసం రాఘవ భుజం పట్టుకున్నాడు వెంకట్రామయ్య. రాఘవ, వెంకట్రామయ్యను రావిచెట్టు అరుగుపైన కూర్చోబెట్టాడు.

''చూసావా రాఘవా! మన చేతిలో ఏమీలేదు. ఒక్క క్షణం క్రితం మనం తలచింది ఒకటైతే వేణుగోపాలుడు మరొకటి తలచాడు. మాధవ ఆలోచన ఆఖరిక్షణంలోనైనా మారుతుందేమోనని మిణుకుమిణుకుమన్న నా ఆశ కాస్తా ఆరిపోయింది'' అన్నాడు వెంకట్రామయ్య తల పక్కకు తిప్పుకుంటూ.

స్నేహితుడి చుబుకం పట్టుకుని తనవైపుకు తిప్పాడు రాఘవ. వెంకట్రామయ్య కళ్లల్లో కన్నీటి సముద్రాలు ఉప్పెనలా కన్పించాయి.

''బాధపడకురా వెంకట్రామా. మనం నిర్ణయం తీసుకోవడం ఆలస్యం చేసాం. మనలో నిర్ణయాలు తీసుకోవడంలో వేగం తగ్గిపోయింది. ఈ తరాన్ని మనం అందుకోలేం. అన్నప్రాసన రోజే ఆవకాయ తినేయాలని చూస్తోంది నేటితరం. పరుగెత్తయినా పాలే తాగుతామంటున్నది నేటి యువత. ఉట్టి సంగతి తర్వాత ముందు స్వర్గానికే నిచ్చెనలు వేస్తామంటున్న వీరి వేగం, దూకుడు ముందు మనం పరుగులు పెట్టి అందుకోలేం. ఇక ఎక్కువ బాధపడకు. నీకోసమే మాధవవాళ్లు ఎదురుచూస్తుంటారు. త్వరగా వెళ్లు. సాయంత్రం గుళ్లో కలుస్తాను'' చెప్పి వెంకట్రామయ్య చేతిని ఆప్యాయంగా నొక్కి వెళ్లిపోయాడు రాఘవ.

ఇంటికి అదే కూలిపోతున్న తన ఇంటికి చేరుకున్నాడు. శరీరంలో ఉన్న రక్తమంతా తీసేసినంత నిస్సత్తువ ఆవహించింది వెంకట్రామయ్యకు.

అప్పటికే కూల్చేసిన వేపచెట్టు చూడగానే ఆయనకు దుఃఖం పొంగుకొచ్చింది. పక్షులగూడు ఎక్కడ పడిపోయిందో అందులో పసికూనలు ఏమయ్యాయో, జరుగుతున్నది తెలియని ఆ పక్షిపిల్లలు తల్లికోసం చేస్తున్న అరణ్యరోదన బుల్‌డోజర్ల శబ్దంలో అక్కడున్న ఎవరికీ విన్పించి వుండదు తన హృదయానికి తప్ప. సాయంత్రం గూడు చేరాలని వచ్చిన తల్లి పక్షి చెట్టు, చెట్టుపైవున్న తన గూడు కనిపించక పిల్లలు ఎక్కడున్నారో తెలియక గోడుగోడున చేసే హృదయ విదారక రోదన గుర్తుకు రాగానే వెంకట్రామయ్య మనసు కకావికలైంది. కళ్లనుండి జారిపడ్డ కన్నీళ్లను వెంటనే తుడిచేసుకున్నాడు ఎవరూ చూడకూడదని. కానీ అనుభూతుల వెల్లువలో తడుస్తున్న ఆయన మనసు మాత్రం ఎవరూ చూడలేరన్న ధైర్యంతో ఎడతెరిపి లేకుండా మూగబాధ అనుభవిస్తూనే వుంది.

వెంకట్రామయ్యను చూసి మాధవ, కోడలు, మనవరాలు దగ్గరకు వచ్చారు. ఏదో చెప్పాలనుకున్నాడుగానీ గొంతు పూడుకుపోయినట్లన్పించడంతో ఎలాగో చెప్పాడు ''గుడికెళ్లొస్తున్నా'' అని. గొంతులో జీర స్పష్టంగా తెలుస్తోంది.

''మీ కోసమే ఎదురు చూస్తున్నాం. మీరు, విజయ, మనీత కార్లో కొత్త ఇంటికి వెళ్లండి నాన్నా. నేను ఇక్కడ డిమాలిషన్ పూర్తయ్యాక వస్తాను'' అని చెప్తూ తండ్రి తదేకంగా చూస్తున్న కూలిపోయే ఇంటివైపు ఓసారి చూసాడు మాధవ. ఒక్కసారి అతను మనసు కలుక్కుమంది. కానీ అతనిలోని వ్యాపార దృక్పథం అతని అంతరంగంలోని భావాలను బయట పడనీయలేదు.

కోడలు, మనవరాలు, వెంకట్రామయ్యను తీసుకుని వచ్చి కారులో కూర్చోబెట్టారు.

కారు నెమ్మదిగా కదిలింది.

ఒకసారి వెనక్కి తిరిగి చూసాడు కారు వెనుక అద్దంలో నుండి వెంకట్రామయ్య. మసక మసకగా కన్పిస్తోంది. అది అద్దంలో నుండి చూడ్డంవల్లనో, తన కళ్లు చెమర్చడం వల్లనో అర్థంకాలేదు.

గోడలు కూలిపోతున్నాయి. ఇటుకలు, రాళ్లు రాలిపోతున్నాయి. ద్వారబంధాలు తెగిపోతున్నాయి. వాటి క్రింద అనుభూతుల శకలాలు సమాధి చేయబడుతున్నాయి.

★

